www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 45 | 22-08-2022 | పుటలు : 4

## విమానాశ్రయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో నన్నయ విద్యార్థులు






**15.08.22 (మీడియాసెల్)**
రాజమహేంద్రవరం మధురపూడి విమానాశ్రయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డైరెక్టర్ మనోజ్ కుమార్ నాయక్ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తితో చక్కని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన వీసీ విశ్వవిద్యాలయ అధికారులను డైరెక్టర్ మనోజ్ అభినందించారు. అనంతరం విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు చేతుల మీదుగా విద్యార్థులు సర్టిఫికెట్లను, జ్ఞాపికలను అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాజమండ్రి విమానాశ్రయంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులు దేశభక్తితో సాంస్కృతిక ప్రదర్శనలు అందించడం హర్షనీయమన్నారు. విద్యార్థులు సమాజాభివృద్ధి, దేశాభివృద్ధికి ప్రయోజనకరమైన కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. విద్యార్థుల ఉన్నతికి విశ్వవిద్యాలయం పని చేస్తుందని తెలియజేసారు. రాజమహేంద్రవరంలోని అన్ని భాష, సంస్కృతి, సాహిత్యం మరియు కళలకు సంబంధించిన కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. అటువంటి అవకాశాలను విద్యార్థులకు కల్పించాలని, విద్యార్థుల ఉన్నతికి అధ్యాపకులు మార్గనిర్దేశం చేయాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఎడ్యుకేషన్ కళాశాల అధ్యాపకురాలు శ్రీరాజేశ్వరిదేవి విద్యార్థులు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు




కలెక్టర్ మాధవీలత ను కలిసిన వీసీ జగన్నాథరావు

ప్రభుత్వ నూతన విద్యా మార్గదర్శకాల ప్రకారం రెండవ సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేందుకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవిలత ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ ఏర్పాటయింది. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ తొలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ హాజరయ్యారు. నూతన విద్యా మార్గదర్శకాల ప్రకారం రెండవ సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేందుకు కలెక్టర్ తో పలు అంశాలను వీసీ చర్చించారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న సైన్స్, ఆర్ట్స్, మేనేజ్మెంట్ విద్యార్థులు ఎంత మంది ఉన్నారనే అంశాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఇండస్ట్రియల్ ఆఫీసర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, రెవెన్యూ అధికారులు మరియు కళాశాలల సమన్వయంతో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలన్నారు. అధికారులతోనూ, కళాశాలల యాజమాన్యలతోను సంప్రదింపులు జరుపుతూ విద్యార్థులకు చక్కని ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలని చెప్పారు. కలెక్టర్ మాధవిలత కు వీసీ జగన్నాథరావు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా మాదిరిగానే పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలలోని డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులందరికీ ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామన్నారు. కళాశాలలు అందుబాటులో ఉన్న వివిధ పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మార్కెటింగ్ సంస్థలు మొదలైన వాటిలో విద్యార్థులచే ఫిజికల్ ఇంటర్న్‌షిప్‌లు చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమానికి డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ హాజరయ్యారు.


## 22 నుండి నన్నయలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్

### బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ జగన్నాథరావు

**17.08.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 22వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఆరురోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. బుధవారం ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కు సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిపార్టుమెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ సహకారంతో ఈ నెల 22 నుండి 27వ తేదీ వరకు విశ్వవిద్యాలయంలో ఆరురోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు. "మెంటరింగ్ ఫర్ ఇన్స్టిట్యూషనల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ ఫెసిలిటేషన్ ఫర్ కమ్యూనిటీ ఎంగేజ్మెంట్" అనే అంశంపై నిర్వహిస్తున్న ఎఫ్.డి.పి. కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ఎం.జి.ఎన్.సి.ఆర్.ఇ రూరల్ మెనేజ్మెంట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ సిహెచ్.చేతన్ బాబు వ్యవహరిస్తున్నారన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ విభాగాలకు చెందిన అధ్యాపకులందరూ దీనికి అర్హులన్నారు. తొలి విడతగా 40 మందితో ఎఫ్.డి.పి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కావున ఆసక్తి ఉన్న అధ్యాపకులంతా www.mgncre.org ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లో సంస్థాగత నాయకులకు మార్గదర్శకత్వం, సమూహ ప్రక్రియలను సులభతరం చేయడం, గ్రామ ఇమ్మర్షన్ పద్ధతులు మరియు సాంకేతికతలు, కీలక వ్యూహాలు మరియు వ్యూహాత్మక నాయకత్వం, శిక్షణ విధానాలు చర్చలు మరియు పద్ధతులు, అకడమిక్ లీడర్ల కోసం సులభతర నైపుణ్యాలు, ఫీల్డ్ లెర్నింగ్ కోసం అసైన్మెంట్లు, ఉన్నత్ భారత్ అభియాన్ మరియు అకడమిక్ లీడర్షిప్, అకడమిక్ లీడర్షిప్ లో అనుభవపూర్వకమైన అభ్యాసం, శ్రేష్ఠత కోసం మార్పును అమలు చేయడం, ఎక్సలెన్స్ కోసం మార్పును అమలు చేయడం, సంస్థాగత సమాజాన్ని అభివృద్ధి చేయడం, గ్రామీణ నాయకత్వ స్ఫూర్తి, గ్రామీణ నాయకత్వ ప్రేరణ, రూరల్ అడ్మినిస్ట్రేషన్, రూరల్ డెవలప్మెంట్, కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ ప్రాసెస్, అడ్మినిస్ట్రేటివ్ లీడర్షిప్, ఇన్స్ట్రక్షన్ లీడర్షిప్, ఆపరేషనల్ లీడర్షిప్, అకౌంటబిలిటీ మ్యాచ్ వంటి విషయాలను తెలుసుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, డైరెక్టర్ సిహెచ్.చేతన్ పాల్గొన్నారు.



ఎఫ్.డి.పి బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు




### మంచి మాట

*నమ్రత, నిగర్వం, అహింస, ఓర్పు, నిజాయితీ, శారీరక మానసిక శుభ్రత, ఇంద్రియ నిగ్రహం, అహంభావం లేకపోవటం, బంధాలకు అతీతంగా ఉండటం ఇవన్నీ వికాసానికి సోపానాలు!!*

- గీతాచార్యుడు

## సంపాదకీయం



# కర్తవ్యనిష్ఠ

తామరాకు మీద నీటి బిందువులా నిత్యజీవితంలో ఒడుపుగా నెట్టుకు రావడం ఎలాగో నేర్పిన గొప్ప వ్యక్తి గీతాచార్యుడు.

తపస్సు చేయమని ఆదేశించలేదు, అలాగే అనుబంధాలను వదిలేసుకుని కాషాయం కట్టుకోమని కూడా సలహాలు ఇవ్వలేదు, భక్తికి సంబంధించిన ప్రస్తావనే చేయలేదు, జీవితం గాలి బుడగని, సంసారం దుఃఖ సాగరమని నిరాశ పరచనూ లేదు. ఆనంద విషాదాల నడుమ, గెలుపు ఓటముల మధ్య ఒక యోగిలా ఎలా బతకాలో నేర్పాడు.

సాఫ్ట్వేర్ ఇంజనీర్ అయితే ప్రోగ్రామింగే ముక్తి మార్గమని, బ్యాంకు ఉద్యోగి అయితే డెబిట్ క్రెడిట్లే జపతపాలని, గృహిణి అయితే వంటిల్లే ధ్యాన కేంద్రమని ధైర్యం చెప్పాడు.

కర్మయోగం అంటే పనిచేయటం. అకర్మ అంటే ఏ పనీ చేయకపోవటం.సకామ కర్మ అంటే ప్రతిఫలాన్ని ఆశించి చేసేపని అని, నిష్కామకర్మ అంటే ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా పనిచేయటమని అర్థం.ఈ నాలుగు విషయాల చుట్టూ 'కర్మ యోగమంతా' తిరుగుతుంది.

పని చేయాలి. కష్టపడి పని చేయాలి. అది కూడా గొప్ప నైపుణ్యంతో పని చేయాలి. అదే ప్రపంచమన్నట్టు చేయాలి. ఎవరూ వేలెత్తి చూపనంత గొప్పగా పని చేయాలి. ఎవరూ కూడా ఆజమాయిషీ చేయాల్సిన అవసరం లేకుండా చేయాలి. ఆ చేసే పనిలోనే ఆనందాన్ని అనుభవించాలి.అంతవరకే మన బాధ్యతంటారు గీతాచార్య.

ప్రతిఫలాన్ని ఆపేక్షించకుండా ఒక యజ్ఞంలా పనిచేయడమే కర్మయోగమని గొప్ప నిర్వచనాన్నిచ్చారాయన.మనో వికాసమే కర్మ యోగానికి తొలిమెట్టని సూచించారు. ధర్మబద్ధంగా మన కర్మని మనం నిర్వర్తించకపోతే మన పని నుంచి మనం పారిపోయినట్లేనన్నారు.

శుభ్రత, నిరాడంబరత్వం మొదలైనవన్నీ శారీరక తపస్సులని,నిజాన్ని మాట్లాడటం, మంచి సంభాషణలను జరపటం, ఉత్తమ గ్రంథాల్ని చదవటం ఇవన్నీ మాటతో చేసే తపస్సులు. ప్రశాంతమైన మనసు, మనోనిగ్రహం, చక్కని ఆలోచనలు, భావాలు మానసికమైన తపస్సులని తెలియజేశారు.

స్వేచ్ఛగా ధైర్యంగా పనిచేసే చోటనే గొప్ప సృజన ఉంటుందని, నైపుణ్యం వెల్లివిరుస్తుందని,

ఊగిసలాటకు ఆస్కారమే లేదని, అదే విజయానికి కారణమని తేలికగా సందేశాన్నిచ్చారు.

బద్ధకాన్ని వదులుకోమని, శ్రమజీవన సౌందర్యాన్ని కీర్తిస్తారు. కర్మ చేయటానికి నిరాకరించిన అర్జునునికి చివాట్లు పెట్టే వంకన మనకు కర్మయోగాన్ని బోధించారు. నిజానికి గెలుపులో తీపి లేదు, ఓటమిలో చేదూ లేదు. ఈ రెండూ పనితో పాటు వచ్చిన ఆనంద విషాదాలు కాదు. చేసే పనితో మనల్ని మనం ముడి పెట్టుకోవడం వల్ల ఏర్పడిన ఇబ్బందులన్నారు.

మ్యాథమెటిక్స్, సైన్స్ బోధించే స్కూల్స్ బోలెడన్ని ఉన్నాయి. మనసుకు శిక్షణ ఇచ్చే సంస్థలు మాత్రం లేవు. అందుకే సమాజంలో మానసిక రుగ్మతలు అధికమవుతున్నాయి. మనసు ప్రభావాన్ని హృదయానికి హత్తుకునేలా వివరించి కర్మయోగం అంటే మనసు మీద మనిషి పొందే గెలుపేననే విషయాన్ని అత్యద్భుతంగా మనకి అందించిన సైకాలజీ ప్రొఫెసర్ ఆచార్య శ్రీకృష్ణ.

**కృష్ణం వందే జగద్గురుమ్**

# నన్నయలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



## స్వాతంత్ర్య స్ఫూర్తితో అభివృద్ధికై పాటుపడదాం
## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



**15.08.22 (మీడియాసెల్)**
ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, వారిని స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధి, విశ్వవిద్యాలయ అభివృద్ధి పాటుపడదామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై జాతీయ జెండాను ఎగురవేసారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని అందించారు. వీసీ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేసారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న భారతదేశం సాధించిన అభివృద్ధి ఘట్టాలను గుర్తుచేసారు. ప్రపంచ దేశాలలో భారతదేశానికి ప్రత్యేక స్థానం ఉందని, బాబాసాహేబ్ అంబేద్కర్ రాజ్యాంగ ద్వారా దేశంలోని ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించే గొప్ప దేశమని అన్నారు. గౌరవనీయులైన రాష్ట్రపతి తన ప్రసంగంలో భారతదేశం ప్రపంచం చూసే అద్భుతమని వ్యాఖ్యానించారని చెప్పారు. క్రీడలలో మనం సాధించిన విశేషమైన విజయాలు, ముఖ్యంగా టోక్యో ఒలింపిక్స్, అంతరిక్షం, చంద్రయాన్ మరియు మంగళయాన్ మొదలైనవి నిదర్శనమన్నారు. భారతదేశం తయారు చేసిన కోవిడ్ కోసం వ్యాక్సిన్ దేశ ఔషద పరిజ్ఞానానికి ప్రతిక అన్నారు. నూతన జాతీయ విద్యావిధానం 2020 ద్వారా అనేక కొత్త కార్యక్రమాలను ప్రవేశపెట్టడంతో, విద్యా సంబంధ భాగస్వామ్యం క్రమంగా మెరుగుపడిందన్నారు. మన గ్రాడ్యుయేషన్ రేటు 86.11 శాతంగా ఉందన్నారు. ఉన్నత విద్యా సంస్థల నుండి సాయుధ దళాలకు, ప్రయోగశాలల నుండి ఆట స్థలాలకు మరింత మంది బాలికలు పురోగతిని కొనసాగించాలని ఆశిస్తున్నామన్నారు. మునుపెన్నడూ లేనంతగా నేడు, అట్టడుగు వర్గాలకు చెందిన భారతీయులు పక్షపాతం మరియు వివక్షకు భయపడకుండా ప్రధాన స్రవంతి సమాజంలోకి ప్రవేశిస్తున్నారన్నారు. రాబోయే కొద్ది సంవత్సరాలలో భారతదేశం మరింత బలంగా ఉద్భవించేలా మరియు పెరుగుతున్న శ్రామిక శక్తి ఆకాంక్షలకు అనుగుణంగా ఆర్థిక సంస్కరణలను ప్రోత్సహిస్తుందన్నారు. 2021-22లో భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగిందన్నారు. ఆర్థిక వ్యవస్థ $ 10.22 ట్రిలియన్ల వద్ద ఉంది, ఇది 2021లో జపాన్ కంటే దాదాపు రెండింతలు ఎక్కువని, ఇది రాబోయే సంవత్సరాల్లో చైనాను అధిగమించి రెండవ స్థానానికి చేరుకుంటుందని ఆకాంక్షించారు. యువతరం మేథోశక్తిని ఉపయోగించి సంస్థలను నెలకొల్పాలని, ఉద్యోగాలను క్రియేట్ చేయాలని సూచించారు. ఈ క్రమంలో మన విశ్వవిద్యాలయ అభివృద్ధిలో మనం ప్రగతిని సాధించామని కోవిడ్ అడ్డంకులు ఉన్న వందకు పైగా వెబినార్లు నిర్వహించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సొంతం చేసుకున్నామన్నారు. ఐ.ఎస్.ఓ, ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపులు తీసుకువచ్చామన్నారు. త్వరలో నాక్ గుర్తింపు నన్నయ విశ్వవిద్యాలయానికి తీసుకువచ్చి మరింత అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. దేశాభివృద్ధి, విశ్వవిద్యాలయ అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని వీసీ సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేసారు. తరువాత విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ మరియు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలలో భాగంగా విశ్వవిద్యాలయం నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేసారు. ఇటీవల ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్, ఉమెన్ క్రికెట్ లో సత్తాచాటిని విద్యార్థులను వీసీ అభినందించి చెక్కులను అంజేసారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





## పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన రిజిస్ట్రార్ అశోక్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన రిజిస్ట్రార్ అశోక్

**20.08.22 (మీడియాసెల్)**


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని పీజీ ఫైనల్ సెమిస్టర్ పరీక్ష కేంద్రాన్ని శనివారం రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ పరిశీలించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలకు చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థులకు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నాలుగవ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ అశోక్ పరీక్ష కేంద్రాలను, పరీక్షల నిర్వహణను పరిశీలించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో చదువుతున్న పీజీ ఆర్ట్స్ మరియు సైన్స్, ఎం.సి.ఎ విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయని తెలియజేసారు.

## తాడేపల్లిగూడెంలో వేడుకలు


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆచార్య కొట్టి శ్రీరమేష్ జాతీయ జెండాను ఎగురవేసి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. తాడేపల్లిగూడెం క్యాంపస్ లోని అందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. మహనీయుల త్యాగ ఫలితమే భారత జాతికి స్వతంత్రమైన వారిని స్మరిస్తూ వారి అడుగుజాడల్లో పయనించాలని సూచించారు.



# 'స్పృహ' సైకాలజీ అలుమ్నికి అభినందన




ప్రతిష్ఠాత్మక అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ APA-2022 వార్షిక అంతర్జాతీయ వర్చ్యువల్ కన్వెన్షన్ లో వరుసగా మూడవ సంవత్సరం పాల్గొన్న ఆదికవినన్నయ "స్పృహ" సైకాలజీ పూర్వ విద్యార్థుల సంఘము అధ్యక్షులు సుంకర నాగేంద్రకిషోర్ కి, మరియు మానవాళికి, సామాజిక శ్రేయస్సుకు నిర్ణయాత్మక సేవలు అందిస్తున్న అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ (APA-2022)కి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొక్కా జగన్నాథరావు తన ప్రశంసా సందేశాన్ని కిషోర్ ద్వారా తెలియ చేశారు. అమెరికాలో మినియపొల్స్ లో ఇటీవల జరిగిన హైబ్రిడ్ ( వర్చ్యువల్ / ఫిజికల్ ) కన్వెన్షన్ లో ప్రముఖ క్రీడాకారులు, క్రీడా పరిశోధకులు, కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్రకిషోర్, అటెండీగా పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో నిష్ణాతులైన సైకాలజిస్టు మానవాళికి ఆవశ్యకంగా మానసిక, సాంఘిక, శాస్త్రీయ కోణాలు విశ్లేషణతో పలు అంశాలుపై తెలియచేశారని నాగేంద్ర కిషోర్ తెలియ చేశారు.




సుంకర నాగేంద్రకిషోర్

**సైకాలజీ వాతావరణం వలన కలిగే మార్పులును అధిగమించే శక్తిని ఇవ్వగలదు ,**

-అడిక్షన్ టు షుగర్, సైకోడేలిక్ ట్రీట్మెంట్ ఫర్ టుబాకో యూస్ డిసర్డర్, గ్లోబల్ సైకాలజీస్ట్స్ అవసరం, ,విద్యా బోధనకు అభిజ్ఞ సవాళు (కాగ్నీటివ్ ఛాలెంజస్ ), ఇంజనీరింగ్ సైకాలజీస్ట్స్ వారి పాత్ర, కోవిడ్ వలన , పిల్లలు, యువత పై , తట్టుకొనే శక్తి, ఇన్ఫర్మేషన్ ఓవర్లోడ్, భావోద్వేగాల నియంత్రణ, భావి తరాలుకు సైకాలజీస్ట్స్ ఆవశ్యకత, వారి విద్యావకాశాలు, తదితర అంశాలపై విషయపరిజ్ఞానం, అవగాహన జరిగిందని కిషోర్ వివరించారు. నన్నయ విశ్వవిద్యాలయం, స్పృహకి ప్రాతినిధ్యం వహిస్తూ, వాటికీ మంచి పేరుతెస్తూ, ఎంతో ఉత్సాహం, ఏకాగ్రత, స్థిరచిత్తంతో పాల్గొన్న నాగేంద్ర కిషోర్ కి అభినందనలు తెలియచేసి, ఈ విషయపరిజ్ఞానాన్ని సైకాలజిస్టుతో పాలుపంచుకోవాలని సూచించారు. గతంలో కిషోర్ స్పృహ, నన్నయ యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తూ 2016,17 లో న్యూఢిల్లీ లో జరిగిన అంతర్జాతీయ స్పోర్ట్స్ కాన్ఫరెన్స్ లలో పేపర్స్, 2019 లో అమెరికా చీకాగోలో సైక్ కాంగ్రెస్ రీజినల్స్, 2019 చీకాగోలో కమ్యూనిటీ సైకాలజీ వార్షిక సదస్సులోను,విశ్వ విద్యాలయ వెబినార్లలో పాల్గొన్నారని అన్నారు. స్పోర్ట్స్ / కమ్యూనిటీ సైకాలజిస్ట్ గా, నన్నయ విశ్వవిద్యాలయ స్పృహ పూర్వ విద్యార్థుల ప్రెసిడెంట్ గా, నాగేంద్ర కిషోర్ అభినందనలు తెలియ చేసి, ఆయన కృషిని ఓ.ఎస్.డి.ఆచార్య ఎస్. టేకి,రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, సైకాలజీ ఫాకల్టీ డా.పి. రాజశేఖర్, డా.నారాయణ నక్కిన, డా. సిహెచ్. భవాని,స్పృహ సభ్యులు ప్రశంసలు తెలిపారు..

# ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో వేడుకలు

**15.08.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డా. ఎం. కమలకుమారి, ఐడియల్ కళాశాలల వ్యవస్థాపకురాలు డా. చిరంజీవిని కుమారి జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.ఎం. కమల కుమారి మాట్లాడుతూ భారతదేశం గత 75 సంవత్సరాలుగా సాధించిన పురోగతిని ప్రణాళిక రూపంలో విద్యార్థులకు తెలిపారు. ఐడియల్ కళాశాలల వ్యవస్థాపకురాలు డాక్టర్ చిరంజీవిని కుమారి మాట్లాడుతూ



ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల కృషి ఫలితమని అన్నారు. భారత స్వతంత్ర సంగ్రామంలో ఒక భగత్ సింగ్ ఒక సుభాష్ చంద్రబోస్ ఒక అల్లూరి సీతారామరాజు వంటి మహనీయులు విప్లవాత్మక పోరాటాలు చేసినా, మహాత్మా గాంధీ వంటి వారు అహింసా మార్గంలో నడిచినా మన స్వతంత్ర భారతావని కోసమే అని గుర్తు చేశారు. అయినప్పటికీ ప్రస్తుత భారత దేశంలో ఇంకా ఎన్నో మార్పులు మధ్యతరగతి జీవితాల అభివృద్ధి, పేదరిక నిర్మూలన, దేశ ఆర్థికాభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఎం. పోచయ్య, పిడి సత్యనారాయణ, శ్రీనివాస్, విజయశ్రీ, గోపి, శ్రీరామరాజు, రాధా మాధవి, స్టీఫెన్, నదీమ్, సత్యనారాయణ, హేమలత తదితర బోధన,బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఫేర్వెల్















# విలక్షణ పి.వి.

## పుస్తకం



పీవీ జీవన విశేషాలపై వచ్చిన పుస్తకాలు చాలా తక్కువ. ఒకటి రెండు రచనలు వచ్చినా అవి పీవీ జీవితంలోని ప్రధాన అంశాన్ని కేంద్రంగా చేసుకుని రాసినవే. అయితే తెలంగాణ యూనివర్సిటీ తెలుగుశాఖ విభాగం ఆచార్యులు, విమర్శకులు అయినా డా.గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి రచించిన "విలక్షణ పీవీ నరసింహారావు జీవిత చరిత్ర" లో పీవీ జీవితంలోని అన్ని అంశాలను కూలంకషంగా వ్రాయడం జరిగింది.

అపర చాణిక్యుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహితీమూర్తి, అర్ధశాస్త్ర మేధావి ఇలా ఒక్కొక్కరికి ఒక్కోలా కనిపిస్తారు మాజీ ప్రధానమంత్రి, తెలుగు తేజం పీవీ. అయితే అందరిని ఇంతలా ఆశ్చర్యపరిచిన పీవీ జీవితానికి పునాదులు ఎక్కడ పడ్డాయనే విషయాలు ఈ పుస్తకంలో చాలా ఉన్నాయి. ప్రతి మనిషి జీవితంలో చాలా మలుపులు ఉంటాయి. ఆ మలుపులే వ్యక్తి గెలుపోటములకు కారణమవుతాయి. అటువంటి మలుపులు పీవీ జీవితంలో చాలా ఉన్నాయి. కొన్ని ఆయనను గెలుపు వరకు తీసుకెళ్తే, మరికొన్ని ఆయనను వ్యక్తిగతంగా ఓడించిన, దేశాన్ని విజయపథంలో నడిపించాయి. వాటి వివరాలన్నీ ఈ పుస్తకంలో చాలా ఉన్నాయి.

తన రాజకీయ జీవితంలో పీవీ తీసుకున్న ప్రతి నిర్ణయాలను రచయిత ఈ పుస్తకంలో ప్రధానంగా చర్చించారు. వాటి గురించి సమాచారంను ప్రముఖుల గ్రంధాలనుండి తీసుకొని ఉదాహరణలుగా ఇచ్చారు.చదివే పాఠకునికి విసుగు కలిగించకుండా చాలా జాగ్రత్త పడ్డారు.

పీవీ స్వభావం ఎటువంటిదో ఉన్నది ఉన్నట్టుగా వివరించారు.తన రాజకీయ జీవితంలో ఎక్కువగా స్వీయరక్షణ ధోరణి పాటించారని వ్యాఖ్యానించారు.1952 లోక్ సభ ఎన్నికల్లో ఎదురైన ఓటమి దీనికి చక్కటి ఉదాహరణ.పీవీ తన స్వస్థలం హుజురాబాద్ నుండి కాకుండా ఎక్కడో దూరాన ఉన్నా మంథని నుండి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం,మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ తన పరిధికే పరిమితం అవ్వడం, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్ర ఆదేశాలు కోసం ఎదురుచూడడం, ఇందిరాగాంధీ దారుణ హత్య తర్వాత ప్రధాని పదవికి పోటీ పడకపోవడం వంటి చాలా అంశాలు పీవీ రక్షణాత్మక ధోరణిని చూపిస్తాయి.

ఈ పుస్తకాన్ని మనం సర్వ సమగ్ర జీవిత చరిత్రగా చెప్పవచ్చు.ఇందులో మొత్తం 27 అధ్యాయాలు ఉన్నాయి."ప్రధానులు–కొన్ని పోలికలు, కొన్ని విభేదాలు" లో మిగతా ప్రధానులతో పీవీని పోల్చారు.అలాగే "స్వపక్ష మిత్రులు" "విపక్ష నేస్తాలు" అనే రెండు అధ్యాయాల్లో పివి మిత్రుల్ని,శత్రువుల్ని స్పష్టంగా చెప్తాయి.

అలాగే నిజాం వ్యతిరేక పోరాటంలో పీవీ సాయుధుడై పాల్గొన్న సంగతి, రాష్ట్రంలో తెలుగు అకాడమీ ఏర్పాటు, గురుకుల విద్యాలయాల స్థాపన, రాష్ట్ర మంత్రిగా ఆరు బయట జైలు ఆరంభించడం వంటి లక్షణాలు పీవీ ఉన్నాయని రచయిత చెప్పారు.

అలాగే బాల్యం మొదలుకొని మహా ప్రస్థానం వరకు పీవీ జీవితాన్ని చిత్రాల రూపంలో అందించారు. ఆయన యొక్క బాల్యం,విద్యాభ్యాసం,సాహితీ సేవ రాజకీయ ప్రస్థానం, పదవులు, పాలనా విశేషాలు, ప్రధానిగా ఆయన చూపిన చొరవ...ఇలాంటి అనేకనేక అంశాలు రచయిత స్పష్టంగా ఇందులో పొందుపరిచారు. "పీవీ బహుభాషా వైవిధ్యం", "సాహిత్యంలో సన్నిహితులు", "అక్షరవనంలో విలక్షణ గమనం" అనే మూడు అధ్యాయాలు సాహితీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటాయి.

అతి సామాన్య కుటుంబంలో పుట్టి,దేశ ప్రధానిగా మన దేశ స్థితి గతులను మార్చిన మన తెలుగు తేజం పై వచ్చిన ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవ దగినది.

– బి.సుశాంత్ కుమార్,
బి.ఈడి సెకండ్ ఇయర్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in